


# చూసే కనులకు మనసుంటే....

ఎస్. జ్యోతీనాథ్

"వెన్నెల వేడిగా ఉండడ మేమిటి? అని ఆశ్చర్యపోయేవాడు తను. విరహా న్ననుభవించే ప్రేమికులకే కాదు, ఆకలి మంటలకి తట్టుకోలేని తన లాంటి అభాగ్య జీవులకికూడా వెన్నెల వేడిగానే ఉంటుంది అని ఇప్పు డర్థమవుతూంది."

నిద్ర పోవడానికి శతధా ప్రయత్నించి, విసిగి, వేసారిపోయి, మెల్లగా రూమ్ తలుపులు తెరిచి, వరండాలో కొచ్చి నిలుచున్న శరత్, బయట విశ్వ మంతా ఆవరించి ఉన్న ఆ వెన్నెల వెలుగు జిలుగుల్ని చూసి బాధగా అనుకున్నాడు.

"కడుపు నిండితేనే ఏ ప్రకృతి అందాల నారాధించినా ఏ కళల స్వారస్యా న్నాస్వాదించినా..." లుంగచుట్టుకు పోతున్న కడుపులో పేగుల్ని గట్టిగా నొక్కుకున్నాడు. అప్పటికి తనేమీ ఊరుకోలేదు. కూజాలో మూడొంతుల నీళ్ళు ఖాళీ చేశాడు. కాని కడుపు మారాం మాననంటుందే.

టెంపరరీ ఉద్యోగమే అయినా మరీ అంత హఠాత్తుగా పోతుందనుకో లేదు. ఉద్యోగ జీవితం ప్రారంభించాక, తను చేసిన వన్నీ టెంపరరీ ఉద్యోగాలే. నిరుద్యోగిగా హేళనలూ, అవమానాలూ, అగచాట్లూ పడీ పడీ, పర్మనెంట్ కాని ఉద్యోగాలతో జీవితంతో రాజీ కొచ్చేశాడు తను. ఫస్ట్‌క్లాస్ డిగ్రీ, టైప్ షార్ట్‌హాండ్ హయ్యర్ ఫస్ట్‌క్లాసులూ కేవలం గాడ్ ఫాదర్ లేమివల్ల తన నాదుకోలేక పోయాయి. ఆదరించి కడుపున దాచుకోవాల్సిన తలిదండ్రులు మాటల తూట్లతో బాధించగా లేంది, తోడబుట్టిన వాళ్ళు అర్థం చేసుకుంటారని నమ్మక మేముంటుంది? తప్పు తనది కాదు. వ్యవస్థదని వాళ్ళకి మాత్రం తెలీదూ? తెలుసు. తెలిసినా అర్థం కానట్టు ప్రవర్తించడం... తన భారాన్ని మోయడం ఇష్టంలేక.

రెండు పూటలా పట్టెడు మెతుకులు పెడుతున్నందుకు పరోక్షంగా ఎన్ని మాట లనేది పెద్ద వదిన! ఎంత బండ చాకిరీ చేయించుకునేది! ఆ అవమానాలూ, ఆ కన్నీళ్ళూ అన్నయ్య దాకా పోకుండా జాగ్రత్త పడేవాడు తను. సహనానికీ అంతుంటుంది అనేదాకా వెళ్ళాయి పరిస్థితులు. లేని దొంగతనం అంటగట్టడం, స్నేహితుల ముందు తనని పనివాడిగా చిత్రీకరించడం తన హృదయాన్ని భగ్న మనిపించాయి. ఇల్లరికం వెళ్ళిన చిన్నన్నయ్య భార్య ఏమనేది? "ఏమయ్యా! నువ్వూ ఏ ఆస్తి ఉన్న పిల్లకో వల వెయ్యి—ఈ ముష్టి ఉద్యోగాలు చేసే బాధ తప్పుతుంది" అని. తన అసహాయత వాళ్ళకి పరిహాసప్రదం! అన్ని విధాలా బాగున్నప్పుడే! మనిషి? పరిస్థితులు బాగాలేనంత మాత్రాన ఆ మనిషిలో హృదయం చచ్చిపోవలిసిందేనా

అప్పుడే కారు చీకటిలో కాంతికిరణంలా అన్నయ్య స్నేహితుడెవరో తన ఆఫీసులో ఎటెండర్ పోస్ట్ ఉందంటే, ముందూ వెనకా చూడకుండా ఒప్పేసుకున్నాడు. తన ఉద్యోగం తన వాళ్ళకి అవమానకరం అని తెలుసు. కాని నిరుద్యోగిగా తను అనుభవించిన అవమానాల ముందు వాళ్ళు పొందే అవమాన మేపాటి? ఎటెండర్ పోస్ట్‌తో ప్రారంభమయిన తన ఉద్యోగ పర్వం, తన నింత దాకా జీవితంలో నిలదొక్కుకునేలా చేయలేదు. తీరం చేరాలని అన్ని కెరటాలకీ ఉంటుంది. చేరే తరుణ మెప్పుడో ఎవరు చెప్పగలరు? అంతదాకా పస్తులూ, ఆకలి మంటలూ, వయసుతో తలెత్తే కోరికలూ, అవి ఎదుర్కొనే నిరాశలూ తప్పవు.

ఇంటి ఓనర్ రామ్మూర్తి మంచివాడే. ఏదో ఆఫీసులో తను పని చేస్తున్నప్పుడు కలిగిన అతని పరిచయం, తనకి తల దాచుకునేందుకు నీడ చూపింది. తను ఉద్యోగాలు మారాడు కాని, నీడ మాత్రం అప్పి వచ్చిన దానిలా అలాగే నిలిచి ఉంది. మూడే గదుల ఇంట్లో, ఒక గది ఏబై వచ్చినా చాలు అని అద్దె కిచ్చాడంటే, రామ్మూర్తి ఆర్థిక పరిస్థితు లేమిటో సులభంగానే అంచనా వేయవచ్చు. ఆ గది చాలా చిన్నది. ఇద్దరే మనుషులు కాళ్ళు చాపుకుని విశ్రాంతిగా కూర్చోవచ్చు, గదిలో ఇతర సామానేం లేకపోతే.

రెండే గదుల్లో రామ్మూర్తి, అతని భార్యా, తల్లీ, పెళ్ళి కావలిసిన ఇద్దరు చెల్లెళ్ళూ, ఇద్దరు మగ పిల్లలూ ఉంటారు. ఉదయం వెళ్ళిన ఆ మనిషి రాత్రి పదయితే కాని ఇల్లు చేరడు. బాధ్యతలూ, విశ్రాంతి ఎరుగని శ్రమా అతన్ని వయసుకి మించిన వాడ్ని చేశాయి. అతని మొహంలో చిరునవ్వు చెక్కు చెదరదే. అదే తన కాశ్చర్యం. కొంతమంది జీవితంలో లభించిన వాటితో రాజీ పడి పోతారు. తనూ రాజీ పడాల్సిందేనా ఈ ఆకలి మంటలతో, స్థిరత్వం నివ్వని ఉద్యోగాల వేటతో? ఉషోదయ మెప్పుడు?


"మీరు భోజనం చేయలేదు కదూ?" నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణంలో, మెల్లని మృదువైన స్వరం శరత్ ఆలోచనల్ని భగ్నం చేసింది. తల తిప్పి చూశాడు శరత్. తనకి కొస్త దూరంలో ఆ అమ్మాయి...వూహించని విధంగా. మాటలు మరిచిన వాడిలా క్షణ కాలం అలాగే చూస్తూండి పోయాడు. ఆమె ఎవరో తనకి తెలుసు. రామ్మూర్తి పెద్ద చెల్లెలు. పేరు లావణ్య. పేరుకీ, రూపానికీ అతికని ఎందరో వ్యక్తులకి ప్రతీక ఆమె. ఆమెఎవరైనా కానీ, ఎలాగైనా ఉండనీ. అంత ఆత్మీయంగా తన నా ప్రశ్న వేసే వాళ్ళు కనపడి చాలా కాలమే అయింది.

మౌనంగా తల అడ్డంగా వూపా డతను, 'చేయలే దన్నట్టు.

లావణ్య చేతిని ముందుకు చాపింది. చాపిన ఆ చేతిలో పళ్ళెం, ఆ పళ్ళెంలో చపాతీలూ, కూరా కనిపించాయతనికి. కళ్ళెత్తి ఆమె వైపు చూశాడు. అతని కళ్ళలో నీళ్ళు. నోట్లోనూ నీళ్ళే. ప్రపంచంలో అందమూ, ఆనందమూ ఎక్కడుంది అని ఆ క్షణంలో అతన్నెవరైనా అడిగితే, ఆకలి బాధ గమనించి, ఆహారంతోపెద దీర్ఘగుణ స్త్రీ హృదయంలో అని ఎలుగెత్తి చెప్పేస్తాడు.

"తీసుకోండి, శరత్!" అదే మృదుత్వం లావణ్య గొంతులో.

కృతజ్ఞత రంగరించిన చూపులతో ఆమెని నిలువెల్లా అభిషేకించి, ఆ పళ్ళాన్ని ఆర్తిగా అందుకున్నాడు శరత్. ఆ తరవాత కొద్ది క్షణాల పాటు అతనికి పళ్ళెంలో చపాతీలు తప్ప మరేమీ కనిపించ లేదు.




"అన్నయ్యా, వదినా వాళ్ళు పెళ్ళి కెళ్ళారు. ఇంకా రాలే దెందుకో?" స్వగతంగా అనుకుంటున్నట్టు అంది లావణ్య వీధి వైపు దృష్టి సారిస్తూ. "ఎందుకో నిద్ర రాలేదు. కాస్సేపిలా తిరిగితే నన్నా వస్తుందేమో నని..." ఆమె శరత్ వైపు చూసింది. ఖాళీ పళ్ళెంతో ప్రశ్నార్థకంగా చూస్తూ నిలుచున్నాడు.

"తినేశారా? ఇటివ్వండి. మజ్జిగ తెస్తాను." పళ్ళెం అందుకుని లోపలి కెళ్ళింది లావణ్య. వెన్నెల చల్లదనం అప్పటికి తెలిసింది శరత్‌కి. మజ్జిగ గ్లాసు అందిస్తున్న లావణ్య దేవతలా అనిపించింది.

"మీకు...మీకు నే నెలా కృతజ్ఞతలు చెప్పాలో..." మాటలు దొరక్క ఆగిపోయాడతను. లావణ్య నవ్వింది. "అవన్నీ కథల్లో మాటలు. నే నేం చేశాను? ఇంట్లో ఉంది. మీకు పెట్టాను."

"ఇంట్లో ఉండీ పెట్టని వాళ్ళని బహుశా లావణ్య చూసి ఉండదు" అనుకున్నాడు శరత్.

చాలాసేపు మౌనంగా నిలుచున్నారు, వీధి వేపు చూస్తూ ఇద్దరూ.

"ఉద్యోగం పోయింది." హఠాత్తుగా అన్నాడు శరత్, ఆప్తురాలికి చెప్పుకుంటున్నట్టు. "పొద్దున్న దాకా జేబులో రూపాయన్నా ఉండేది. ఇప్పు డదీ లేదు."

లావణ్య జాలిగా చూసింది.

"మీ ఆవేదన నాకు తెలుసు శరత్!" సానునయంగా అంది. "మధ్య తరగతి కుటుంబాలలో పెళ్ళి కాని ఆడపిల్లా, ఉద్యోగం దొరకని మగపిల్ల వాడూ గుండెల మీద కుంపట్లు. మనసు చచ్చిన మరమనుషులు. నిజంగా ఒక చల్లని మాటా, సేద దీర్చే హృదయమే ఆ వ్యక్తులకి చాలు. కాని అదే నోచుకోరు." ఆ గొంతులో లీలగా ఆవేశం.

"సారీ! మీతో నేను అతిగా మాట్లాడుతున్నానేమో!" అంతలోనే సిగ్గు.

"లేదు, లేదు" అనే[illegible] కంగారుగా శరత్.

"మా ఆఫీసులో ఒక టైపిస్ట్ పోస్ట్ ఉంది. వివరాలు చెబుతాను. మీరు ప్రయత్నం చేయండి. ఫలితం విషయం నేను గట్టిగా చెప్పలేను. అదంతా

మీ అదృష్టం." లావణ్య అంతవాకా చీరె కొంగు చాటున దాచుకున్న ఎడమ చేతి పిడికిలిని తెరిచి అతని ముందుకి చాపింది. ఏభై రూపాయల నోటు ఉంది దానిలో.

"అవసరం అనేది ప్రతి మనిషికీ కాస్త వెనకా ముందూగా వస్తుంది. మరో ఉద్యోగం దొరికేదాకా ఈ చిన్న సహాయం కాదనకండి."


ఏభై రూపాయలు కాదు. ఏభై పైసలుకూడా విలువైనవే తనకి ఆ క్షణంలో.

"ఎవరు నువ్వు? నా బాధ గమనించి, ఉపశమనం చేకూర్చేందుకు వచ్చిన దేవతవా?"

మౌనంగా నోటు అందుకున్న శరత్‌తో అందామె చిరునవ్వుతో:

"వెళ్ళి పడుకోండి. రేపు వివరాలు చెబుతాను."

"లావణ్యా! చిన్న సహాయం అంటూ మీరు చేసింది చిన్న సహాయం కానేకాదు. ఇంతవాకా జీవితంలో నేను పొందిన పెద్ద సహాయమేదన్నా ఉంటే అది ఇదే." శరత్ కెన్నో చెప్పాలనుంది. కాని అంతకన్నా మాటలు దొరక్క నిశ్శబ్దంగా తన గదిలో కెళ్ళిపోయాడు. రామ్మూర్తి చెల్లెలుగా




లావణ్యతో ముఖపరిచయం మాత్రమే ఉండేది ఇన్నాళ్ళూ. ఏదో ఆఫీసులో ఉద్యోగం చేస్తూందని తెలుసు. నల్లగా చెంపలమీద స్ఫోటకం మచ్చలతో వయసు తెచ్చే లావణ్యాన్నికూడా అంది పుచ్చుకోలేని లావణ్యని చూస్తుంటే తనకి లోపల్లోపల ఎంతో సానుభూతి. తను ఇంటికి అద్దె కొచ్చాక, లావణ్యని చూడడానికి పలుసార్లు దుగుడు వరులు వచ్చారు. ఏ సంబంధమూ కుదర లేదు. సంబంధం కుదరలేదని తెలిసిన రోజున చాలా చిత్రంగా ఆమె తల్లీ, వదినా లావణ్యని మాటలతో తూట్లు పొడుస్తుండేవారు. గదిలో ఉండి వినేందుకే తన కెంతో బాధగా ఉండేది. ఇక ఆ మాటలు పడే వ్యక్తి సంగతి చెప్పాలా? ఒక అర్ధ రాత్రి పూట ఆత్మహత్యా ప్రయత్నం దాకాకూడా పోయిందామె. అప్పటినుండీ కాస్త జాగ్రత్తగా ఉంటున్నారంతా. సమస్య వేరైనా లావణ్యా, తనూ ఒకే పరిస్థితిలో ఉన్నారు. అది చేయని నేరానికి శిక్ష అనుభవించడం.

ఉద్యోగం దొరక్క పోవడం తన నేరమా? పెళ్ళి కాకపోవడం ఆమె నేరమా? రూపమే అవరోధం కాకపోతే లావణ్యలాంటి అమ్మాయిని పొందిన వ్యక్తి ధన్యుడు!

ఇదేమిటీ...హఠాత్తుగా తన ఆలోచనలు ఈ రకంగా పరుగులు తీస్తున్నాయి? ఆమె తనకి సహాయం చేసిందన్న కృతజ్ఞతా? ఆమె కష్టం పట్ల సానుభూతా ఆమె రూపం అడుగు పొరల్లో దాగిన సహృదయం పట్ల సంతోషమా?

• • • •

సంతోషకరమైన వార్త అది తనకి! ఎడారిలో మండు టెండలో ఎన్నో రోజులు దాహంతో ప్రయాణం చేసిన వ్యక్తికి చల్లని ఒయాసిస్సు దొరికింది. శరత్‌కి ఉద్యోగం దొరికింది. మారే అవసరం అంతగా లేని, అంతగా రాని ఉద్యోగం. మేనేజర్‌కి పి. ఎ. అతను. ఆకాశంలో మేఘాలు ఉత్సాహంగా కదులుతున్నాయి. పక్షులు ఆనందంగా పాడుతున్నాయి. గాలి తన్మయత్వంతో వీస్తూంది. ప్రపంచం ఇంత అందంగా తన కెప్పుడూ కనపడ లేదు. శరత్ మనసులో లావణ్య మెదిలింది. బజారుకెళ్ళి పూలూ, స్వీట్సూ కొన్నాడతను. 'నీ డబ్బే నీకు...నీ కోసం. ఖర్చు పెడుతున్నాను, లావణ్యా!'

ఇంటి కెళ్ళేసరికి పెళ్ళివారు ఎదురయ్యారు గుమ్మానికి ఎదురుగా.

బలి పశువులా వాళ్ళ ముందు లావణ్య.

గదిలో కెళ్ళి కూర్చున్నాడు శరత్. అతని మనస్సెందుకో చిరాగ్గా అయింది. స్టవ్ మీద టీ చేసుకుని తాగాడు. అశాంతిగా అనిపించింది. లేచి బయటికి వెళదామనుకుంటుండగా, లావణ్య వచ్చింది గదిలోకి, రామ్మూర్తి కొడుకుతో.

"కంగ్రాచ్యులేషన్సండీ!" అంది సంతోషంగా చూస్తూ.

"థాంక్స్! ఉండండి...మీకోసం ఇవి తెచ్చాను." గూట్లో పెట్టిన పూలూ, స్వీట్సూ తెచ్చి అందించాడు. లావణ్య జాగ్రత్తగా అందుకుంది. అప్పుడామె కళ్ళలోకి చూస్తే, ఆ కనుపాపలు చెప్తాయి 'జీవితంలో నన్ను ఆడపిల్లగా భావించి; పూలు తెచ్చి అందించిన మొట్టమొదటి వ్యక్తివి నువ్వు' అని.

"ఇది మీ డబ్బుతో కొన్నదే!" సిగ్గుగా అన్నాడతను.

"డబ్బెవరిదైనా...ఇవి కొని నా కివ్వాలనుకున్న ఆ మనసు మీదేగా" లావణ్య అందం మాటల్లో ఉంది.

"రాగానే ఇద్దామనిపించింది. వాళ్ళెవరో ఉన్నారు. నా మూడ్ మారిపోయింది. కనీసం ఈసారైనా నేను మీకు కంగ్రాట్యులేషన్స్ చెప్పే అవకాశం రావాలని మనసారా దేవుణ్ని కోరుకుంటున్నాను."

నవ్వుతున్న లావణ్య ముఖం చిన్నబోయింది.

"మీది చాలా పెద్ద కోరిక! దేవుడు అంత పెద్ద కోరికల జోలికి పోడు" అంది తల దించుకుని భారంగా. "ఈ పెళ్ళి చూపుల తంతు ఒక ఫార్స్. అయినా నాలో ఏదో ఆశ. ఆశ లేని మనిషి ఉండడు గదా. పోనీండి. ఇవన్నీ ఎందుకు? మీ రెంతగానో దిగులు పడుతున్న పర్మనెంట్ ఉద్యోగం రానే వచ్చింది. విష్ యూ ఆల్ ద బెస్ట్."

• • • •

"విష్ యూ ఆల్ ద బెస్ట్" నవ్వుతూ పెద్ద అట్టపెట్టెని చేతిలో పెట్టాడు మేనేజర్. శరత్ చిరునవ్వుతో, "థాంక్యూ" అన్నాడు. 'అంటే ఇంత పెద్ద తనువ్వది గతంలో వన్న మాట!'

ఉంగరాల మార్పిడితో రిజిస్ట్రారాఫీసులో జరిగిన తమ పెళ్ళికి ఆహూతు లధిక సంఖ్యలో లేరు. వచ్చిన వారికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

"గురూగారు ఆదర్శంగా వివాహమాడారు" అన్నాడు, వచ్చిన కొలీగ్స్ గుంపులో ఒకతను. అతని కంఠంలో హేళన శరత్ కనిపెట్టకపోలేదు.

"అనవసర ఆర్భాటాలు లేకుండా వివాహమాడడం ఆదర్శమనిపిస్తే...అవును, మాది ఆదర్శ వివాహమే" అన్నాడతను నవ్వుతూనే.

ఆ గుంపు అలా వెళ్ళిందో లేదో మరో గుంపు వచ్చింది.

"ఏమీ తెలీనట్టుంటారువాళ్ళే చూడు...ఎలాంటి పని చేస్తారో" అంది గుసగుసలుగా ఒక అమ్మాయి. ఆ గుంపంతా లావణ్య సెక్షన్‌వాళ్ళు.

'పాడుపని చేసినట్టు మాట్లాడుతోందే' తమాషాగా అనుకున్నాడు శరత్.

"లావణ్య కూడా లవ్ మారేజి చేసుకుంటుందనుకోలేదు" అంది మరో అమ్మాయి సెక్షన్ తరపున బహుమతి అందిస్తూ.

"ఏం. నేను మనిషినికానా?" నవ్వుతూ అంది లావణ్య.

"అహా. అదికాదూ" అని నాన్చేసిందా అమ్మాయి. ఆమె మగవాళ్ళని రెచ్చగొట్టేలా డ్రెస్ చేసుకుంటుంది. అలంకరణలో అందానికి మెరుగులు దిద్దుకుంటుంది. కాని ఇంకా పెళ్ళికాలేదు. లావణ్యని ఆమె ప్రక్కన స్పష్టంగా చూస్తుంటే తనకి కడుపుమంటగా ఉంది.

వాళ్ళంతా పైకి మాటగా చెప్పరు. కాని మనసులో ఉద్దేశం ఎలాగైనా వెళ్ళగక్క అనందించాలనే తాపత్రయం. పరస్పర ప్రేమాభిమానాలుండే స్త్రీ పురుషులు వివాహంతో వాటిని మరింత పటిష్టం చేసుకోవాలనుకుంటారని వాళ్ళకి తోచదు.

అవును. తను లావణ్యని ఆదర్శంకోసం వివాహమాడలేదు. అభిమానంకొద్దీ, ఆదరణ కోరి పెళ్ళాడాడు. అది ఈ లోకాని కర్థమవుతుందా? ఏమాత్రం అందమూ, లావణ్యమూ లేని లావణ్యని తనెలా మెచ్చి చేసుకున్నాడన్నది వాళ్ళ ఆశ్చర్యం.

ప్రేమించి పెళ్ళాడేవాళ్ళు అందానికే ప్రాధాన్యత నిస్తారని వాళ్ళ నిర్ణయం. వాళ్ళ నిర్ణయానికి భిన్నంగా జరగడం తన పొరపాటు కాదు. అయినా లావణ్య అందం రూపంతో వ్యక్తమయ్యేది కాదు. హృదయానికి కళ్ళుండాలి ఆ అందం తిలకించా లంటే. తనిలా పైకి చెప్తే అంతా నవ్వుతారేమో పిచ్చి ముదిరిందని. కాదేదీ కవిత కనర్హం అని శ్రీశ్రీ అన్నట్లు అందం లేని వ్యక్తి లేడు, చూడగలిగే కళ్ళకి. లావణ్య అందం కళ్ళలో ఉంది. అవి ఆమె నిర్మల హృదయానికి దర్పణాలు గనక. సాటివాళ్ళ కష్టంలో ఉంటే సానుభూతి చూపగల సహృదయం...ఎంతటి మనస్తాపాన్నీ చిరునవ్వుతో దాచి తిరగగల సహనం...ఇవి ఆమెకి పెట్టని ఆభరణాలు.

"ఆ...ఈ పెళ్ళికి కట్నకానుకలు కూడానా" దూరంగా తల్లి ఈసడింపుగా ఎవరితోనో అంటున్న మాటలు గాలిలో తేలివచ్చాయి. శరత్ లావణ్య వేపు అప్రయత్నంగా చూశాడు. ఆమె కూడా ఆ మాటలు వింటున్నట్టే కన్పించింది. మెల్లిగా ఆమె చెయ్యి నొక్కి వదిలేశాడు శరత్.

"పది పదిహేనువేలదాకా వచ్చేదండీ మావాడికి. లవ్ మారేజీ అంటూ ఈ లంపటాన్ని తగిలించు కున్నాడు. పెళ్ళీడు కుర్రాడు కన్పిస్తే చాలు... వలవేసి లాగేద్దామా అని కాచుకునుంటారండీ ఈ కాలంలో ఆడపిల్ల తలి దండ్రులు. అయినా వాళ్ళనని లాభమేముంది? మన బంగారం మంచిది కావాల గాని..." తల్లి తెగ బాధపడిపోతోంది.

కట్నంలేని సంబంధం అని తెలిసి తన తండ్రి ఎంత ఎత్తున ఎగిరాడు! 'నీ చదువుకి పెట్టిన డబ్బు ఎవడి బాబు సొమ్మనుకుంటున్నావ్?' అని ఉరిమాడు ఆఖరి అస్త్రంగా. తను చలించలేదు. 'తలిదండ్రులు పెళ్ళి చేసేది చదువుకి పెట్టిన డబ్బూ, తిండి తినిపించిన ఖర్చూ రాబట్టడానికి కాదు నాన్నా! అయినా ఈ కాలంలో ఆడపిల్లల్ని కూడా చదివిస్తున్నారు తలిదండ్రులు. జీవితాంతం భర్త ఇంటికి వచ్చి, తన మానప్రాణాలను వెచ్చించి సేవచేసే ఆడపిల్లకి వెలకట్టడం భావ్యంకాదు నాన్నా!' అన్నాడు తను. తన మాట లాయన కర్థంలేని నీతు లైనాయి.

"సానీ, లవ్ మారేజీ గదా. ఏ రంభా, వూర్వశో చూద్దామని తెగ సంబర పడ్డా నత్తయ్యా. మన కాకినాడలో అప్పల నరసమ్మే బాగుం దీవిడ గారికన్నా. అయినా అదేం నలుపు, బాబూ. ఎన్ని సబ్బు లరగ దీస్తే పోతుంది?" పెద్ద వదిన జోక్. మనసు నొప్పించేదంతా జోక్సే వేరు. మనుషుని కుళ్ళ బొడిచే జోక్స్ వేరు. అది ఆవిడ కర్థం కాదు. హృదయపు లోతుల్ని సున్నితంగా స్పృశించే అందా లుంటాయని ఆవిడ వూహించనుకూడా వూహించలేదు.


షామియానా ఖాళీ అయింది. జనం ఆట్టే లేకపోవడంతో వాళ్ళెంత మెల్లిగా మాట్లాడు కుంటున్నా మనకున్నా వినిపిస్తూనే ఉన్నాయి.

"కట్నాల కోసం ఏడిచేదెవడు? ఉన్నది ముచ్చటగా ముగ్గు రాడపడుచులం కదా. కొత్త జరీ చీరలు పెట్టకూడదూ? ముష్టివాళ్ళకి వేసినట్టు నేత చీరలు మన మొహాన కొట్టారు." గొప్పింటి కోడ లైన తన చిన్న చెల్లెలి గునుపు.

"అయ్యోరాత. వాళ్ళ మొహాలకి జరీ అంటే తెలుసా ఏమన్నావా? వాళ్ళ వదిన చూడు. ఇక్ష్వాకుల నాటి చీర కట్టుకుని ఎలా తిరిగిందో" అంది పెద్ద చెల్లెలు అసహ్యంగా ముఖం పెట్టి.

శరత్‌కి నవ్వు వచ్చింది. అసలు ఆ పెట్టుపోతల ఆర్భాటమూ వద్దనే అన్నాడు తను, రామ్మూర్తితో. కాని అతనే వూరుకోలేదు. 'మొదటిసారి నా చేతుల మీదుగా చేస్తున్న పెళ్ళి. నా శక్తికొద్దీ ఇస్తానంటే, కాదు కూడదనలేక పోయాడు తను. ఇరువురు వ్యక్తులు కలిసి జీవించేందుకు ప్రాతి పదికగా జరిగే ఈ వివాహ తతంగంలో ఒక వేపు వాళ్ళు లాంఛనాలంటూ దోచుకోవడం, మరో వేపు వాళ్ళు భయంగా మొక్కుబళ్ళు చెల్లించు కోవడం ఎందుకు?

"అసలు నా బాధ...చక్కటి కుర్రాడు పోయి పోయి ఆ పిల్లని చేసుకోవడ మేమిటి? ఉదయం చూస్తే రాత్రి కలొచ్చేలా ఉంది. ఇంక మన




ఆంధ్రదేశంలో ఆడపిల్లలే కరువైనట్టు..." చిన్న వదిన యాక్షన్‌తో సహా బాధ వ్యక్తపరుస్తోంది.

శరత్ కెంత కోపం వచ్చిందంటే వెళ్ళి, అందరి బాధలూ తీరేలా ఒక్కొక్కళ్ళనీ లాగి టపటపా చెంపలు వాయించేద్దామనిపించింది. వాళ్ళ బాధలూ, అభిప్రాయాలూ, జోకులూ ప్రకటించడానికిదా సమ యం? అందులో సంతోషంగా పెళ్ళాడి, చిందు మారేళ్ళా తోడూ నీడగా కలిసి పయనించాలని ఆకాంక్షిస్తున్న కొత్త జంట ముందు? తను ఒక పూట తినీ, ఒక పూట తినకా పూర్తిగా పస్తులుండీ గడిపినాడు వీళ్ళంతా ఏమై పోయారు? వీళ్ళ సానుభూతి ఏమై పోయింది? మనసున్న మనిషిగా చూశారా తన నసలు?

"లావణ్యా!" మృదువుగా పిలిచాడు శరత్.

"వూఁ!" నవ్వింది లావణ్య, అతని వేపు చూసి. ఆమె కళ్ళు చెప్పాయతనికి. "మీ అండ ఉంటే ఈ మాటలు నాకో లెక్కకాదు" అని.

• • • •

గదిలో కూర్చుంది లావణ్య.

జరిగిందంతా కలా అనిపిస్తుం దో క్షణం.

ఆకలితో అలమటించే వాడికి గంజి పోస్తే చాలు. కాని సంపదలక్ష్య పరమావధితో విందు చేస్తే ఎలా ఉంటుంది?

తన పరిస్థితి అలాగే అయింది.

ఎవరో ఒక మగవాడు తన మెడలో పసుపుతాడు బిగిస్తే చాలు అనుకుంది. కాని తనని అభిమానించి తాళి కట్టేవాడు దొరకడం అదృష్టంకాక మరేమిటి? శరత్ చేసుకుంటానన్న రోజు తన మెదడు దిమ్మెర పోయింది. తన మీద సానుభూతితో జీవితం నాశనం చేసుకోవద్దు అని చాలా బతిమాలింది. తనని చేసు కుంటే నలుగుర్లోనగుబాటే అని నచ్చచెప్ప ప్రయత్నిం చింది. కాని శరత్ వినలేదు. తననే చేసుకుంటా నని అంత గట్టిగానూ పట్టుపట్టాడు.

"వినూ, నీ అందాన్ని మెచ్చి కాదమ్మా చేసు కుంటూంది. నెలనెలా సంపాదిస్తున్నావుగా. కరుకులా అయిదారు వందలు." అంది వదిన హేళనగా.

"వచ్చిన పెళ్ళి వారికి టిఫిన్లు వండి పెట్టలేక చస్తున్నాము. ఈ పిల్లకు నో మాయదారి సంబంధ మన్నా కుదిరితే బాగుండును" అని చాటు మాటుగా వినుకున్నవే వదినేనా?

"సానీ వదినా. ఆ డబ్బుల కోసమైనా చేసుకుంటు న్నాడుగా" అంది తను నవ్వేస్తూ. 'కట్నం ముడుపు కోసం మళ్ళీ కొసరకుండా...'

"కట్నం లేకుండా మీ అమ్మాయిని చేసుకుంటు న్నాడంటే ఇందులో ఏదో లొసుగుందండీ అందిరా కామాక్షమ్మ" అంది తల్లి భోజనాల వేళ ఒక రాత్రి అన్నయ్యతో గుసగుసగా.

"సానీ, లొసుగుల్లేని సంబంధాన్ని కుదిర్చి పెట్టమను అవిడ్ని. నిక్షేపంగా దాన్నిచ్చి చేస్తాను" అన్నా డన్నయ్య. ఎంత బాగా అన్నాడన్నయ్య.అన్నయ్యే మొదట్నుండి తనని రూపంతో ప్రమేయం లేకుండా ఆదరించాడు, అభిమానించాడు. పెళ్ళి చేసి ఒక ఇంటిదాన్ని చేయాలని తపన పడ్డాడు.

"కట్నం అడిగితే ఇవ్వలేం. కట్నం తీసుకోకపోతే అనుమానం. ఇదమ్మా మన మధ్య తరగతి కుహ్నా డంబర జీవన విధానం" అన్నా డన్నయ్య తరువాత.

"రంగు నలుపైనా, మాయదారి అని విన్ను చేసుకుంటున్న ట్టున్నాడు." కొలీగ్ రాధ ఈర్ష్య దాచుకోవడానికి ప్రయత్నించ లేదు.

"నెలనని, మాయని ఈ రంగులో ఏమాకర్షణ కనిపించింది, శరత్, నీకు?"

అడుగుల చప్పుడు విని లావణ్య తలెత్తి చూసింది.

వచ్చింది శరత్! దగ్గరగా వచ్చి గడ్డం పైకెత్తి కళ్ళలోకి ప్రేమగా చూశాడు.

"లైట్ తీసెయ్యనివ్వండి. రాత్రి కలొచ్చి కుడిచేస్తావేమో" అంది లావణ్య, చాప మీద కొరిగి చెయ్యి పట్టి తన వేపు లాక్కుంటున్న అతనితో.

"లావణ్యా! రూపం చూసి భ్రమించేవాళ్ళవి ఆ భయాలన్నీ. నువ్వు నా కెప్పుడూ చిక్కటి చీకటిలో మిరుకాంతివి. చల్లని నీడవు." అతను మరి మాటలు పొడిగించలేనివాడిలా హఠాత్తుగా ముందు కొంగి లావణ్య పెదవు లందుకున్నాడు ఆమెని వివశురాల్ని చేస్తూ.

బతుకులో తీయదనాన్ని పంచి ఇచ్చిం దా రాత్రి ఆ మాలిన దంపతులకి. *